
సాక్షి
బాపట్ల
గురువారం । 17 । ఆగస్టు । 2023



కాళీమాతకు విశేష పూజలు

ఫిరంగిపురం: 113 తాళ్లూరు గ్రామంలోని కాళీ మాత ఆలయంలో అమ్మవారికి అధిక శ్రావణ బహుళ అమావాస్యను పురస్కరించుకొని బుధవారం విశేష పూజలు చేశారు.



బండ్లమ్మవారి సేవలో ..

పిట్టలవానిపాలెం : బాపట్ల జిల్లా చందోలులోని బగళాముఖి అమ్మవారికి రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీ మోహన్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆలయానికి రూ.5 లక్షల విరాళం

వినుకొండ(నూజెండ్ల) : గంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి గుడి పునర్నిర్మాణానికి యర్రగొండపాలెంకు చెందిన జి.సూర్యనారాయణ బ్రదర్స్ రూ. ఐదు లక్షల 116 విరాళం అందజేశారు.

న్యూస్‌రీల్

గుంటూరు తూర్పులో 59.2 మి.మీ వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 59.2 మిల్లీమీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా తాడేపల్లి మండలంలో 1.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. సగటున 17.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. గుంటూరు పశ్చిమ 58.4, చేబ్రోలు 36.4, తెనాలి 31.2, ప్రత్తిపాడు 27.2, పెదకాకాని 27, దుగ్గిరాల 15.8, వట్టిచెరుకూరు 15.6, కొల్లిపర 8, పొన్నూరు 7.8, తాడికొండ 7.2, కాకుమాను 5.8, మంగళగిరి 4.2, మేడికొండూరు 4.1, ఫిరంగిపురం మండలంలో 3.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షం పడింది.

నేటి నుంచి నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్షలు

గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాలలో గురువారం నుంచి జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్‌ఎం) సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వైద్య కళాశాలలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా పలు నర్సింగ్ పాఠశాలల విద్యార్థులు హాజరు కానున్నారు. ఈ నెల 19 వరకు థియరీ పరీక్షలు, 26 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని, పరీక్షల చీఫ్‌ఎగ్జామినర్, జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్ తెలిపారు.


ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఉపకార వేతనాలకు ఎంపిక చేసేందుకు ఉద్దేశించిన జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 3వ తేదీన రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో జరగనున్న పరీక్షకు ప్రభుత్వ, జెడ్పీ, ఎయిడెడ్, మున్సిపల్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు మోడల్ హైస్కూళ్లలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చొప్పున పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌తో పాటు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించాలని సూచించారు.

నవోదయ దరఖాస్తుకు నేటితో ఆఖరు

నరసరావుపేట ఈస్ట్: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష రాసేందుకు ఈ నెల17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని, మండల విద్యాశాఖాధికారులు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ తమ పరిధిలోని విద్యార్థులను నవోదయ పాఠశాలల ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 519.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 862.00 అడుగుల వద్ద ఉంది.

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్ : గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ. 2,200, గరిష్ట ధర రూ. 4 వేలు, మోడల్ ధర రూ. 3 వేల వరకు పలికింది.

వైఎస్సార్ సీపీని తిరుగులేని శక్తిగా చేద్దాం






విజయసాయిరెడ్డితో సమావేశమైన మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ మోపిదేవి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి, బాచిన కృష్ణచైతన్య

- రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుదాం
- బాపట్ల జిల్లా నేతలకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి దిశానిర్దేశం




విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛాలు అందిస్తున్న ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్యేలు కోన, బలరాం, నాయకుడు వెంకటేష్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో పార్టీని తిరుగులేని శక్తిగా నిలిపి, రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయకేతనం ఎగురవేసేలా ముందుకు సాగాలని వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. రెండురోజుల జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం బాపట్లకు చేరుకున్న విజయసాయిరెడ్డి స్థానిక కోన భవన్‌లో పార్టీ నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున (వేమూరు), ఎంపీ మోపిదేవి వెంకటరమణ (రేపల్లె), ఆమంచి కృష్ణమోహన్(పర్చూరు), బాచిన కృష్ణ చైతన్య (అద్దంకి), కరణం వెంకటేష్, బలరాం (చీరాల)లతో విజయసాయిరెడ్డి విడివిడిగా సమావేశమయ్యారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ పోతుల సునీత, మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుతోనూ మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితులు, ఆయా నియోజకవర్గాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాల వివరాలను, పార్టీ అనుబంధ విభాగాల కమిటీ నియామకాల గురించి అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ స్థాయిలో ద్వితీయ, తృతీయ స్థాయి నాయకుల మధ్య సమన్వయం తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. నియోజకవర్గాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలో పార్టీని తిరుగులేని శక్తిగా నిలపాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం నియోజకవర్గాల పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల్లో జరుగుతున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. గురువారం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నేతలతో సమీక్షలు నిర్వహించనున్నారు.

సమసమాజమే లక్ష్యంగా ముందుకు..

కలెక్టర్ రంజిత్‌బాషా



ప్రదర్శన ప్రారంభిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: స్వాతంత్య్ర సమరయోధుల స్ఫూర్తితో సమ సమాజమే లక్ష్యంగా అంతా ముందుకు సాగుదామని కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. 'నా మట్టి– నా దేశం' కార్యక్రమంలో భాగంగా బాపట్ల పురపాలక సంఘ ఉన్నత పాఠశాల నుంచి చేపట్టిన భారీ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి బుధవారం ప్రారంభించారు. బాపట్ల పురపాలక సంఘ ఉన్నత పాఠశాల నుంచి మొదలైన ఈ ప్రదర్శన పాత బస్టాండ్, అంబేడ్కర్ సర్కిల్, రథం బజార్, జీబీసీ రోడ్డు, మీదుగా పురపాలక సంఘ ఉన్నత పాఠశాలకు చేరుకుంది. జాతీయ జెండాను చేతబూనిన విద్యార్థులు కదం తొక్కారు. అడుగడుగునా దేశభక్తి ఉప్పొంగింది. జాతీయ నేతల వేషధారణలతో పలువురు విద్యార్థులు ఆకట్టుకున్నారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జాతీయ భావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, డీఈ శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.ఎస్.నారాయణభట్టు, కత్తి శ్రీనివాసరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తాం

బాపట్ల: ఓటర్ల సంక్షిప్త సవరణ జాబితా సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో పొందుపరుస్తామని కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. ఓటర్ల సంక్షిప్త సవరణ జాబితా సర్వే ప్రక్రియపై గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్లో సమావేశం నిర్వహించారు. సర్వే త్వరలో ముగియనుందని కలెక్టర్ చెప్పారు. బాపట్ల జిల్లాలో ఇప్పటివరకు 3,61,263 లక్షల కుటుంబాల సర్వే పూర్తయిందన్నారు. మార్పులు, చేర్పుల కోసం 8,840 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మృతులు, శాశ్వత వలసలు వెళ్లిన 3,614 మందిని గుర్తించామని, వీరి వివరాలు జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. కొత్తగా 4,435 మంది ఓటు హక్కు పొందడానికి అర్హులుగా గుర్తించామని వెల్లడించారు. ఒక కుటుంబంలోని వ్యక్తులందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు ఉండేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని వివరించారు. జగనన్న కాలనీలలో నిర్మించిన గృహాలకు డోర్ నంబర్లు కేటాయించాలని, ఇంకొల్లులో సర్వే ప్రక్రియ ప్రారంభం కాలేదని రాజకీయ పార్టీల నేతలు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేత ఇనగలూరి మాల్యాద్రి, బీఎస్పీ నేత కె.కోటేశ్వరరావు, బీజేపీ నేత మోహన్‌రావు పాల్గొన్నారు.

గుంటూరు–బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్ట్‌కు కేంద్రం ఆమోదం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం రామకృష్ణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంటూరు–బీబీనగర్ మధ్య 239 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులకు రూ.2,853.23 కోట్ల అంచనా వ్యయంతో కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. స్థానిక పట్టాభిపురంలోని డివిజనల్ డీఆర్‌ఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంటూరు–బీబీనగర్ లైన్ గుంటూరు, పల్నాడు జిల్లాల మీదుగా వెళ్తుందని, ఈ రెండు జిల్లాల ప్రయాణికులకు మేలు కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం శ్రీనివాస్, సైమన్, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ డివిజన్ రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం సామాజిక బాధ్యత కావాలి

కొరిటెపాడు(గుంటూరు): సుస్థిర ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని, దీనిని ఓ సామాజిక బాధ్యతగా గుర్తించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ కుమార్ సూచించారు. వాతావరణంలో శరవేగంగా వస్తున్న మార్పుల దృష్ట్యా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత అందరిపైనా ఉందన్నారు. గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ అసోసియేట్లు, ఆదర్శ మండలాల సిబ్బందికి నిర్వహించ తలపెట్టిన మూడు రోజుల రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం విజయ కుమార్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నేల, మనుషుల ఆరోగ్యం బాగుండాలంటే ప్రకృతి వ్యవసాయం సరైన మార్గమని పేర్కొన్నారు. బహుళ పంటల సాగు విధానంపైనా దృష్టిపెట్టాలని సూచించారు. రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి బి.రామారావు, రైతు సాధికార సంస్థ సీనియర్ సలహాదారు జి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

జయహో భవన్



సుఖినో'భవంతి' : జగనన్న కాలనీలో ప్రారంభానికి ముస్తాబైన ఇల్లు



విద్యుత్ వెలుగులు : ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్



నిరంతర జలధారలు : ఏర్పాటు చేసిన కుళాయి

- పేదల గూడు నిర్మాణంలో మనమే నంబర్‌వన్
- రాష్ట్రంలోనే జిల్లాకు మొదటి స్థానం
- కలెక్టర్ బాషా, జేసీ శ్రీధర్ చొరవ వల్లే
- ప్రారంభానికి ముస్తాబైన వేటపాలెం జగనన్న కాలనీ



సంతోషాలు ఉర'కాలనీ': ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వేటపాలెం జగనన్న కాలనీ

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పేదల పక్కా గృహాల నిర్మాణంలో బాపట్ల జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. కలెక్టర్ రంజిత్‌బాషా ప్రత్యేక శ్రద్ధతో అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసి గృహ నిర్మాణాల విషయంలో ప్రగతి సాధించారు. జాయింట్ కలెక్టర్ శ్రీధర్ వరుస సమీక్షలతో అధికారులను పరుగులు పెట్టించారు. ఫలితంగా రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. తొలిదశలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు 5 లక్షల గృహాలను ప్రారంభించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించడంతో జిల్లాల వారీగా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు లక్ష్యాలను నిర్దేశించారు. దీనిలో భాగంగా బాపట్ల జిల్లాలో 11,821 గృహాలను పూర్తిచేయాలని ఆదేశించారు. దీనిని అధిగమించేందుకు కలెక్టర్ రంజిత్ బాషా జాయింట్ కలెక్టర్ శ్రీధర్, గృహనిర్మాణశాఖ పీడీ ప్రసాద్‌తోపాటు అధికారులందరూ శ్రమించారు. పనులను వేగవంతం చేశారు. ఫలితంగా ఇప్పటికే 11,695 గృహాల నిర్మాణం పూర్తయింది.

మోడల్ కాలనీ ఎంపిక

ముఖ్యమంత్రి ఐదు లక్షల గృహాలు ప్రారంభించే రోజు ప్రతి జిల్లాలో అన్ని వసతులతో కూడిన ఒక మోడల్ కాలనీనీ ప్రారంభించాలని రాష్ట్రస్థాయి అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో జిల్లా అధికారులు వేటపాలెం వద్ద చల్లారెడ్డిపాలెం–2, దేశాయిపేట–1, పందిళ్లపల్లి, రామన్నపేట, పుల్లరిపాలెం తదితర ప్రాంతాల్లో మొత్తం 283 గృహాలతో నిర్మిస్తున్న కాలనీని ఎంపిక చేశారు. ఇందులో ఇప్పటివరకు 204 గృహాలు పూర్తయ్యాయి. ప్రారంభించబోయే ఇళ్లన్నింటినీ ఈనెల 24 నాటికి అన్ని వసతులతో పూర్తిచేయాలన్నది లక్ష్యం.

బాపట్ల జిల్లాలో ఇలా..

మొత్తం మంజూరైన గృహాలు	31,083
తొలివిడతలో నిర్మాణ లక్ష్యం	11,821
ఇప్పటివరకు పూర్తయిన ఇళ్లు	11,695

మిగిలిన గృహాల నిర్మాణం శరవేగం

ప్రభుత్వం పీఎంఏవై వైఎస్సార్ అర్బన్ పథకం ద్వారా జిల్లాలో 31,083 గృహాలు మంజూరు చేసింది. వీటిలో 11,695 గృహాలు ఇప్పటికే పూర్తి కాగా మిగిలిన గృహాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. వీటి పనులు వేగంగా సాగుతున్నాయి.

ఇంటి కల నెరవేరింది



మేం నరసరావుపేట నుంచి తుఫాన్ పేటకు 15 ఏళ్ల క్రితం వచ్చాం. నా భర్త పఠాన్ జిలానీ లారీ డ్రైవర్. మాకు ఇద్దరు అమ్మాయిలు. 15 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. గతంలో ఎన్నిసార్లు ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టినా రాలేదు. ఇప్పుడు ఇంటి స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణం నెలక్రితం పూర్తి చేసుకున్నాం. ఇంటికి కరెంటు మీటరు ఉచితంగా ఇచ్చారు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లి చేశాం. నేను, నా భర్త కొత్త ఇంట్లో హాయిగా జీవిస్తున్నాం.

– పఠాన్ గౌసియా, తుఫాన్ పేట, వేటపాలెం

సంతోషంగా ఉంది



జిల్లాలో పేదల గృహ నిర్మాణం వేగంగా సాగుతోంది. కలెక్టర్ మార్గనిర్దేశకత్వంలో అన్నిశాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని పనిచేశాం. సకాలంలో ఇచ్చిన టార్గెట్‌ను పూర్తిచేసే దిశగా కృషి చేస్తున్నాం. జిల్లాకు మొదటిస్థానం దక్కడం ఆనందంగా ఉంది. సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది.

– సి.శ్రీధర్, జాయింట్ కలెక్టర్, బాపట్ల జిల్లా

పేదల సొంతింటి కల నెరవేరబోతోంది



ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించి వారి సొంతింటి కలను నెరవేరుస్తోంది. బాపట్ల జిల్లాలో గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. జిల్లాకు విధించిన లక్ష్య సాధనలో ముందున్నాం. గృహనిర్మాణాల్లో రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచాం. ఇందుకు కారణమైన అధికారులు, సిబ్బందికి అభినందనలు.

– రంజిత్‌బాషా, కలెక్టర్, బాపట్ల జిల్లా

మద్యం మత్తులో కారుతో టీడీపీ కార్యకర్తల హల్‌చల్

- నులకపేట వద్ద బైక్‌ను ఢీకొట్టి కారు వదిలి పరారీ
- ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు



గాయపడ్డ యువకులు



ప్రమాదానికి కారణమైన కారు

మంగళగిరి: లోకేష్ యాత్రలో పాల్గొనేందుకు విజయవాడ నుంచి కారులో వచ్చిన నలుగురు యువకులు మద్యంమత్తులో హల్‌చల్ చేశారు. ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి ప్రమాదానికి కారణమయ్యారు. ఈ దుర్ఘటన బుధవారం జరిగింది. తాడేపల్లి పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ నుంచి కలకాల తేజశ్రీ విష్ణు వర్ధన్ చౌదరి మరో ముగ్గురితో కలిసి లోకేష్ బస చేస్తున్న నగరంలోని యర్రబాలెంకు చేరుకున్నారు. మద్యం పూటుగా తాగి కారులో టీడీపీ జెండాలతో తిరుగుతూ గలాభా సృష్టించారు. తాడేపల్లి నులకపేట వద్ద విజయవాడకు చెందిన ఏసీ మెకానిక్‌లు బి.గోపి, పి.రాఘవేంద్ర ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చౌదరి కారుతో వేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఫలితంగా గోపి, రాఘవేంద్ర గాయపడ్డారు. స్థానికులు ఘటనాస్థలికి చేరుకునేలోపు చౌదరి అతని స్నేహితులు కారు వదిలి పరారయ్యారు. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారును స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

20న ఓపెన్ టెన్నిస్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఓపెన్ ప్రైజ్ మనీ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఈ నెల 20న విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని స్టార్ టెన్నిస్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ కె.డి.గోపాల్ తెలిపారు. గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, మాన్వి ఇంటీరియర్ కాన్సెప్ట్స్, స్టార్ టెన్నిస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అండర్–12, 14, 16 విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 18వ తేదీ లోపు పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99899 94099, 70750 66789ను సంప్రదించాలని సూచించారు.

ఎస్‌ఐలకు సీఐలుగా ఉద్యోగోన్నతులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్‌లోని పలువురు ఎస్‌ఐలకు సీఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీచేశారు.

ఎస్‌ఐ పేరు	విభాగం	జిల్లా/ యూనిట్
ఎ.భాస్కర్	డీఎస్‌బీ	పల్నాడు
ఎన్.వెంకటేశ్వరరావు	నరసరావుపేట వన్‌టౌన్ పీఎస్	పల్నాడు
పోలూరి శ్రీనివాసరావు	రైల్వేస్	రైల్వేస్
ఎస్.నాగూర్ మీరా సాహెబ్	దిశ పీఎస్	గుంటూరు
జె.అనురాధ	అరండల్‌పేట పీఎస్	గుంటూరు
ఇ.నారాయణ	లాలాపేట పీఎస్	గుంటూరు
కె.అజయ్‌కుమార్	దిశ పీఎస్	ప్రకాశం
కుమ్మరి శ్రీనివాసరావు	నల్లపాడు పీఎస్	గుంటూరు
జి.వెంకట నారాయణ	పీటీసీ	పీటీసీ ఒంగోలు
డి.వెంకటేశ్వరరావు	కోవూరు పీఎస్	ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా
సీహెచ్.రాంబాబు	ఇంటెలిజెన్స్	ఇంటెలిజెన్స్
కె.మల్లిఖార్జున	పాదిలి పీఎస్	ప్రకాశం జిల్లా
మేడా శ్రీనివాసరావు	ఎస్‌సిఆర్‌బి, సీఐడీ	సీఐడీ
ఆవుల వెంకటేశ్వర్లు	లింగసముద్రం పీఎస్	ఎస్‌పీఆర్ నెల్లూరు జిల్లా
సిహెచ్.ఐ.ఎస్.శ్రీనివాసరావు	రైల్వేస్	రైల్వేస్
బి.సుబ్బనాయుడు	అరండల్‌పేట పీఎస్	గుంటూరు

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.2.28 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ.2.28 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడుల రూపంలో సమర్పించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులు, ముడుపులను బుధవారం మహామండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 14 రోజులకు గాను రూ.2,28,24,147 నగదుతో పాటు 557 గ్రాముల బంగారం, 5.210 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. రోజుకు సరాసరిన రూ.16.3 లక్షలు హుండీల ద్వారా దేవస్థానానికి ఆదాయం వచ్చిందని వివరించారు. ఇక ఈ–హుండీ ద్వారా దేశంలోని వివిధ ప్రదేశాల నుంచి భక్తులు రూ.82,018 విరాళాలను దేవస్థానానికి సమర్పించారు. కానుకల లెక్కింపును చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు చింకా శ్రీనివాసులు, దేవస్థాన అధికారులు అనురాధ, జి. శ్రీనివాస్ పర్యవేక్షించారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సేవా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సంరక్షణ సమర్థంగా నిర్వర్తించాలి

సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి రాజదెబోరా

రేపల్లె రూరల్: హాస్టల్ విద్యార్థుల సంరక్షణ బాధ్యతలు సమర్థంగా నిర్వర్తించాలని సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి రాజదెబోరా ఆదేశించారు. స్థానిక బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో వివిధ వసతి గృహాల వార్డెన్లు, విద్యార్థులతో బుధవారం సమావేశం నిర్వహించారు. వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యతతో భోజనాన్ని అందించాలన్నారు. భోజనం తయారీలో ఏ మాత్రం నాణ్యత లోపించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్దేశిత మెనూ ప్రకారం సమయ పాలన పాటిస్తూ భోజనం అందించాలని సూచించారు. మౌలిక సదుపాయాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో ప్రణాళికాబద్ధంగా చదివించాలన్నారు. వసతి గృహంలో నిర్వహించే ప్రతి అంశాన్ని రికార్డులలో పొందుపరచాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై వార్డెన్‌లతో సమీక్షించారు. వసతి గృహంలో అందిస్తున్న భోజన సదుపాయాలు, ఇతర అంశాలను విద్యార్థుల నుంచి ఆరా తీశారు. కార్యక్రమంలో వార్డెన్‌లు పావులూరి శివశంకరప్రసాద్, సుజాత, శ్రీనివాసరావు, రాణి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజదెబోరా

రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: రౌడీషీటర్ల కదలికలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలోని సమావేశం హాల్‌లో జిల్లాలోని పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత స్పందన పిటిషన్లు, పోక్సో కేసులు, గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, చీటింగ్ కేసులు, 174 ఐపీసీ కేసులు, మిస్సింగ్ కేసులు, సర్కిల్ క్రైమ్ పార్టీల పనితీరు, గంజాయి, నాటుసారా కట్టడికి తీసుకోవాల్సిన చర్యల గురించి పోలీస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్పందన పిటిషన్లు, జేకేసీ కాల్స్ కు తక్షణం స్పందించాలని చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉండాలని కోరారు. స్టేషన్లలోని అన్ని రకాల షీట్లలో నూతన సమాచారం పొందుపరచాలని వివరించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లను త్వరితగతిన అమలు పరచాలన్నారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఉప ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లాలో కేసుల దర్యాప్తులో, ఛేదనలో, కోర్టులలో నేరస్తులకు శిక్ష పడే విధంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, బాపట్ల, చీరాల, రేపల్లె డీఎస్పీలు టి.వెంకటేశ్వర్లు, ఎస్.ప్రసాదరావు, టి.మురళీకృష్ణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఏవీ రమణ, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, డీసీఆర్‌బీ సీఐ పి.బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్, వేదికపై ఏఎస్పీ మహేష్

20 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట ఈస్ట్: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించనున్న ర్యాలీకి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఆర్మీ ఉద్యోగం కోసం వేలాది మంది అభ్యర్థులు తరలి రానున్నారని తెలిపారు. ఆర్మీ ర్యాలీ నిర్వహించే డడీఎస్ఏ స్టేడియంలోకి ఆయా తేదీలలో సాధారణ పౌరులకు అనుమతి లేదని చెప్పారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. ర్యాలీ పూర్తయిన అనంతరం ప్రజలను స్టేడియంలోకి ఎప్పటిలాగానే అనుమతిస్తారని చెప్పారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

బల్లికురవ: చేపలు పట్టేందుకు నల్ల వాగులో మునిగి ఓ యువకుడు చనిపోయాడు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకోగా బుధవారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని కొణిదెన గ్రామానికి చెందిన కొమరగిరి కొండయ్య(38) పడమర వైపు ఉన్న నల్ల వాగుకు రిక్షాలపై వలలు వేసుకుని చేపల పట్టేందుకు వెళ్లాడు. వాగులో దిగి వల విసురుతూ నీటి గుంతలో పడి చనిపోయాడు. పొద్దు పోయినా భర్త ఇంటికి రాకపోవటంతో భార్య బుజ్జి ఆందోళన చెందింది. విషయాన్ని బావ నరసింహం దృష్టికి తీసుకెళ్లింది. బుధవారం నల్లవాగు వద్దకు వచ్చి చూడగా రిక్షా మాత్రమే ఒడ్డున తేలి ఉంది. వాగులో గాలింపు చర్యలుచేపట్టగా వలవిసిరినచోట కొండయ్య శవమై తేలి కనిపించాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి తండ్రి నరసింహ ఫిర్యాదు మేరకు బల్లికురవ స్టేషన్‌లో ఏఎస్ఐ డి. శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు

విద్యుత్ షాక్‌తో బేల్దారి మేస్త్రీ..

బేల్దారి పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో మేస్త్రీ చనిపోయిన ఘటన బుధవారం బల్లికురవ మండలంలోని కొప్పెరపాడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన టి.యజ్ఞయ్య (30) గ్రామంలోని ఓ ఇంట్లో సిమెంట్ పనులు చేస్తున్నాడు. విద్యుత్ పైపులకు తగలడంతో విద్యుదాఘాతంతో కింద పడిపోయాడు. ఇంటి యజమాని సుబ్బారావు వైద్యానికి అద్దంకి తీసుకెళ్లగా వైద్యశాలలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

భార్యను హత్య చేసిన భర్త



మృతిచెందిన రోహిణి

చీరాల: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను గొంతు నులిమి హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలం తిప్పాలకట్ట గ్రామానికి చెందిన అమర్తలూరి రోహిణికి వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ రోశయ్య కాలనీకి చెందిన దక్కుమళ్ల పవన్‌కల్యాణ్‌తో గత ఏడాది సెప్టెంబర్‌లో వివాహం అయింది. ఇద్దరికి కొంతకాలం మనస్పర్థలున్నాయి. తరచూ గొడవలు పడుతూ ఇరు కుటుంబ సభ్యులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇద్దరి మధ్య పెద్దలు సఖ్యత కుదిర్చారు. మంగళవారం రాత్రి భార్యభర్తలిద్దరూ ఘర్షణ పడ్డారు. ఘర్షణలో భార్య రోహిణిని గొంతు నులిమి హత్య చేసినట్లు భర్త అనంతరం పోలీసులకు లొంగిపోయాడు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ పి.ప్రసాదరావు పరిశీలించారు. అయితే మృతిరాలి తల్లిదండ్రులు మాత్రం మృతికి ముందు కూడా తమ బిడ్డ తమతో ఏడుస్తూ ఫోన్‌లో మాట్లాడిందని చెబుతున్నారు. భర్త మద్యానికి బానిసై నిత్యం అనుమానిస్తూ ఘర్షణకు దిగేవాడని ఆరోపించారు. ఈ మేరకు టూటౌన్ ఎస్ఐ చంద్రావతి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బలవన్మరణం

తెనాలిరూరల్: రైళ్ల కింద పడి వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలిలోని మల్లెపాడు గేటు సమీపంలో బుధవారం సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. మరో ఘటనలో కొలనుకొండ వంతెన సమీపంలో సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనా స్థలాలను తెనాలి జీఆర్పీ పోలీసులు పరిశీలించారు. మృతదేహాలను తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిఘా నేత్రం.. ఇల్లు సురక్షితం

మంగళగిరి మండలం కాజలోని వెంకటరెడ్డిపాలెంలో ఉంటున్న తోట శివశంకరరావు భార్యతో కలిసి ఇటీవల తిరుపతి వెళ్లారు. ఊరెళ్తున్నట్లు అతడు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు.. అతడి ఇంట్లో 'ఎల్‌హెచ్‌ఎంఎస్' కెమెరా బిగించారు. కొద్ది రోజుల తర్వాత ఆ ఇంట్లోకి ఒక ఆగంతకుడు వచ్చాడు. ఆ వ్యక్తి రాకను కంట్రోల్ రూం నుంచి గమనించి, మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే రోజు రాత్రి గస్తీలో ఉన్న పట్టణ ఎస్ఐ నారాయణ, హెచ్‌సీ ఎస్.వందనం ఘటనా స్థలానికి వెళ్లి, దొంగను పట్టుకున్నారు. ఇదీ ఎల్‌హెచ్‌ఎంఎస్ పనితీరు.

ప్రయోజనకరంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్

- చోరీల నివారణలో మేటి
- ఇళ్లల్లో నిఘా కెమెరాలు ఏర్పాటుతో నిత్యం పర్యవేక్షణ

నగరంపాలెం: ఇంటి దొంగతనాలను (హెచ్‌బీ) నివారించేందుకు పోలీస్ శాఖ ఒకడుగు ముందుకేసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా ముందుకెళ్లాలనే ముందు చూపుతో యాప్‌ను రూపొందించారు. మొబైల్ ఫోన్లల్లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నట్లయితే చాలు. ఊరెళ్లిన దగ్గర నుంచి తిరిగి ఇంటికి వచ్చే వరకు పోలీసుల నిఘా ఉంటుంది. సరికొత్త విధానంతో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ ఎంఎస్) ఏపీ పోలీస్ అందుబాటులోకి వచ్చింది.

యాప్ రిజిస్ట్రేషన్, ఉపయోగించే విధానం..

- గూగుల్ ప్లే స్టోర్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్ ఉంటుంది. దాన్ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి.. తద్వారా అందులో పేరు, చిరునామా, సెల్ నంబర్ వివరాలకు సంబంధించి దరఖాస్తును పూరించినట్లయితే, దాన్ని ఆమోదిస్తూ రిజిస్ట్రేషన్ యూనిక్ ఐడీ ఇస్తారు.
- ఎప్పుడైనా ఇంటికి తాళం వేసి వెళితే.. యాప్‌లోని రిక్వెస్ట్ వాచ్‌లో ఫలానా రోజు నుంచి ఫలానా రోజు వరకు ఇంటికి తాళం వేసి వెళ్తున్నట్లు వివరాలు నమోదు చేయాలి.
- ఫలానా రోజుల్లో ఇంట్లో ఉండటం లేదని దగ్గర్లోని పోలీస్‌స్టేషన్లల్లో ముందస్తు సమాచారం ఇవ్వాలి.
- అప్పుడు ఇంటికి పోలీసులు వచ్చి వైర్లెస్ మోషన్ కెమెరా (కెమెరా ముందు కదిలికలు కనిపిస్తే రికార్డు చేసే కెమెరా)ను, మోడెం (వైఫై)ను ప్రత్యేకంగా బిగిస్తారు.
- అప్పటి నుంచి ఇల్లు పోలీసుల నిఘాలో ఉంటుంది. ఇంటికి బిగించిన కెమెరాను గుంటూరు నగరంలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, ఇంటి యాజమాని మొబైల్‌ఫోన్‌కు అనుసంధానం చేస్తారు. కెమెరా ముందు ఏవైనా కదిలికలు జరిగితే వెంటనే ఫొటోలు, వీడియోను రికార్డ్ చేసి, కంట్రోల్ రూమ్‌కు పంపించే సౌకర్యం ఉంది. ఆఖరికి కెమెరా ముందు ఈగ, దోమ కనిపించినా, ఎవరైనా కదిలినా, కరెంట్‌కు అంతరాయం ఏర్పడినా అలారం మోగుతుంది. ఇది చీకట్లోనూ పని చేస్తుంది. దాని పరిధిలో ఎక్కడైనా కదలిక ఉన్నట్లయితే సెన్సార్ గుర్తించి కంట్రోల్ రూంకు సంకేతాలు వెళ్తాయి. పోలీస్ సిబ్బంది అప్రమత్తమై ఆ ఇంటి పరిధిలోని గస్తీ పోలీసులకు సమాచారం ఇస్తారు. తద్వారా దొంగలను పట్టుకుంటారు.

పోలీస్‌స్టేషన్లలోనూ అవగాహన..

ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ సిస్టంను ఫోన్లల్లో ఇన్‌స్టాల్ చేసుకోవడం తెలియకపోయినా సరే..దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే పోలీసులు అవగాహన కల్పిస్తారు. వారే ఫోన్లల్లో డౌన్‌లోడ్ చేస్తారు. ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతి రోజు సుమారు 15 మందితో ఇన్‌స్టాల్ చేయిస్తున్నారు.

అందుబాటులో ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు



గుంటూరు, తెనాలిలో 30కి పైగా ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. ఇంటికి తాళం వేసి ఏదైనా ఊరెళ్లే ముందు తప్పనిసరిగా ఈ యాప్‌లో సమాచారం ఇవ్వాలి. పోలీసులకు సమాచారం అందించినట్లయితే ఇంట్లో ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు బిగించి, రక్షణగా ఉంటారు. దొంగతనం జరిగిన వెంటనే చోరులను పట్టుకునేందుకు అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.ఆరిఫ్‌హఫీజ్, జిల్లా ఎస్పీ

అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారీ

భారతి సిమెంట్స్ డెప్యూటీ మేనేజర్ ప్రతాపరెడ్డి

సత్తెనపల్లి: అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందని, ఇది నాణ్యతకు మన్నికకు మారుపేరుగా నిలుస్తోందని భారతి సిమెంట్స్ డెప్యూటీ మేనేజర్ డీ ప్రతాప రెడ్డి అన్నారు. పట్టణంలోని ఐదులాంతర్ల సెంటర్‌లోని మాడా విశ్వేశ్వరరావు కల్యాణ మండపంలో జీవీఆర్ ట్రేడర్స్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంటు ఎంచుకోవాలని కోరారు. కట్టడాలు పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు భారతి సిమెంట్ దోహద పడుతుందని చెప్పారు. సిమెంట్ తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలనే తమ కంపెనీ ఎంచుకుంటుందని పేర్కొన్నారు. అసిస్టెంట్ మేనేజర్ పూల సురేష్ మాట్లాడుతూ భారతి సిమెంట్ వినియోగించిన కాంక్రీట్‌తో వేసిన శ్లాబులను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యత పరీక్షలను చేసి భారతి సిమెంట్ నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీలు, యజమానులకు వివరించడం జరుగుతుందని చెప్పారు. ఇందుకు సంబంధిత డీలర్ ద్వారా వివరాలు తెలుసుకొని తమకు సమాచారం అందిస్తే సరిపోతుందన్నారు. ఈ సందర్భంగా మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. హాజరైన 150 మంది మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. భారతి సిమెంట్స్ టెక్నికల్ ఆఫీసర్ భవాని శంకర్, జీవీ ఆర్ ట్రేడర్స్ జి.సిద్దారావు పాల్గొన్నారు.



మేస్త్రికి బీమా బాండ్ అందజేస్తున్న ప్రతాపరెడ్డి, సురేష్, భవానీశంకర్

విద్యుత్ శాఖ అధికారుల విస్తృత తనిఖీలు

గుంటూరు ఈస్ట్: నగర విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం ఆధ్వర్యంలో డీ–2 సెక్షన్ పరిధిలోని నల్లచెరువు, ఏటుకూరు రోడ్డు, ఏటుకూరు గ్రామాల్లో బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 61 మంది అధికారులు, 153 మంది సిబ్బంది, 61 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. 4,647 సర్వీసులను తనిఖీ చేసి అను మతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 236 సర్వీసులు కలిగిన వారికి రూ.13.55 లక్షల అపరాధ రుసుము విధించారు. అనుమతించిన కేటగిరి కాక, ఇతర కేటగిరీల్లో విద్యుత్ వాడుతున్న ఇరువురికి రూ. 10వేలు జరిమానా విధించారు. అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 229 మందికి రూ.13.15 లక్షలు, అసలైన వాడకంకంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన ఐదు సర్వీసులను గుర్తించి రూ. 30వేలు జరిమానా విధించారు. ఈసందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబు మాట్లాడుతూ విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయన్నారు. వినియోగదారులు వారి ప్రాంగణాల్లో ఉండే విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేలా నిర్ధారించుకోవాలన్నారు. సీలు లేకపోయినా, తుప్పుపట్టినా, ఊడిపోయినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. విద్యుత్ చౌర్యం నిర్ధారించి కేసు నమోదు చేయడం జరుగుతోందన్నారు. పనిచేయని మీటరు నుంచి విద్యుత్ వాడుకున్న ఉండవలసిన మీటరుకు బదులు వేరే మీటరు ఏర్పాటు చేసి సీలులేకపోయినా విద్యుత్ చౌర్యం నిర్ధారణ అయినట్లు భావించడం జరుగుతోందన్నారు. మొదటిసారి తప్పిదానికి కాంపౌండింగ్ పద్ధతిలో అపరాధ రుసుము చెల్లిస్తే కేసు నుంచి విడిచిపెడతారన్నారు. రెండోసారి తప్పిదానికి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం జరుగుతోందని చెప్పారు. అపరాధ రుసుము చెల్లించలేని పరిస్థితుల్లో రెవెన్యూ రికవరీ చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేస్తారన్నారు. మొదటి సారి తప్పిదానికి మూడు రెట్లు, రెండో సారి తప్పిదానికి ఆరు రెట్లు జరిమానా విధిస్తారని చెప్పారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమన్నారు. విద్యుత్ చౌర్యం జరిగితే 9440812263, 9440812360, 94408 12361 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. దాడుల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.సూర్యప్రకాష్, డీఈఈ ఎం.రవికుమార్, కె.రవికుమార్, డి.రాజమోహన్‌రావు, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎ.దివ్యా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసబాబు

జాతీయస్థాయి జూడో పోటీలకు పట్టణ క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయి జూడో పోటీలకు పట్టణానికి చెందిన ఎస్.శిరీష, షేక్ మస్తాన్ ఎంపికైనట్లు జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి జి.సాయిరామ్ బుధవారం తెలిపారు. నెల్లూరులో ఈనెల 12వ తేదీ నుంచి 15వతేది వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్, సీనియర్ జూడో పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన పలువురు క్రీడాకారులు పతకాలు సాధించటంతో పాటు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. ఈనెల 28వ తేదీ నుంచి ఢిల్లీ నిర్వహించనున్న జాతీయ జూడో పోటీలలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. జూనియర్ బాలుర విభాగం 90 కిలోల కేటగిరిలో షేక్ మస్తాన్, సీనియర్ బాలికల ఓపెన్ వైట్ 63 కిలోల కేటగిరిలో శిరీష ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖరరెడ్డి, సీఈఓ పి.రాంబాబు, కోశాధికారి షేక్ సుభాని, కోచ్ ఓ శివకృష్ణ అభినందించారు.

సెల్‌ఫోన్ షాపులో భారీ చోరీ

వినుకొండ టౌన్: పట్టణంలోని ఓ మొబైల్ షాపులో భారీ చోరీ ఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. షాపు నిర్వాహకుడు కొత్తమాసు గురుప్రసాద్ తెలిపిన వివరాలు.. స్థానిక లాయర్స్ స్ట్రీట్‌లోని కింగ్ మొబైల్స్ దుకాణం షట్టర్‌కు వేసిన తాళాలను వేసినట్లే ఉంచి, షటర్‌ను ధ్వంసం చేసి దొంగలు షాపులోకి వెళ్లి చోరీకి పాల్పడ్డారు. దాదాపు 30 లక్షల రూపాయలు విలువ చేసే వందకు పైగా సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయన్నారు. ఘటనా స్థలాన్ని పట్టణ సీఐ సాంబశివరావు పరిశీలించారు. సీసీ పుటేజీలను పరిశీలించగా నలుగురు దొంగలు షటర్ను పగుల గొట్టి, గోతాలతో లోపలికి ప్రవేశించి విలువైన సెల్‌ఫోన్లను దొంగిలించారని నిర్ధారణకు వచ్చారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

24న అథ్లెటిక్స్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్(క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 24న స్థానిక బీఆర్ స్టేడియంలో అండర్–14, 16, 18, 20 బాల బాలికల, యువతీ, యువకుల జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తామని కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 23 సాయంత్రంలోపు స్టేడియంలో తమ వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్, రెండు ఫొటోలతో పోటీల్లో పాల్గొనాలన్నారు.

29న గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డ్స్..

గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డ్స్ అందిస్తామని ఫౌండేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత పదేళ్లుగా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నామన్నారు. క్రీడాకారులు, స్పోర్ట్స్ జర్నలిస్టులు, కోచ్‌లను ఎంపిక చేస్తామని చెప్పారు.

తామర పురుగుపై అప్రమత్తంగా ఉండాలి

నరసరావుపేట రూరల్: పత్తిలో తామర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని పత్తి పంట ప్రధాన శాస్త్రవేత్త ఎం.సుధారాణి సూచించారు. మండలంలోని పెదరెడ్డిపాలెం, కేఎం అగ్రహారం ఆర్‌బీకే పరిధిలోని పత్తి, సోయాబీన్ పంటలను జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, శాస్త్రవేత్తలు ఎం.సుధారాణి, డాట్ సెంటర్ శాస్త్రవేత్త జి.రమేష్, ఎఫ్‌టీసీ డీడీఏ ఎం.శివకుమారి బుధ వారం పరిశీలించారు. ప్రధాన శాస్త్రవేత్త ఎం.సుధారాణి మాట్లాడుతూ పత్తి పంటలో తామర పురుగు, రసం పీల్చే పురుగులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. నీలం రంగు జిగురు అట్టలు, పసుపు రంగు అట్టలను పొలంలో అమర్చుమని సూచించారు.